# నమస్తే తెలంగాణ
# సూర్యాపేట

5 | నల్లగొండ, మంగళవారం 4 జూన్ 2024 | SURYAPET

నల్లగొండ కౌంటింగ్ హాల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన

# నేడే ఓట్ల లెక్కింపు

## ఉదయం 8గంటలకు షురూ..

- ముందుగా పోస్టల్ బ్యాలెట్లతో మొదలు
- ఆ వెంటనే ఈవీఎంల కౌంటింగ్
- ఒక్కో రౌండ్‌లో 98 ఈవీఎంల్లోని ఓట్ల లెక్కింపు
- 22 నుంచి 24 రౌండ్లలో తేలనున్న విజేత
- సాయంత్రం 4 గంటల వరకు తుది ఫలితం
- చివర్లో ఒక్కో అసెంబ్లీ నుంచి 5వీవీ ప్యాట్ల లెక్కింపు
- పకడ్బందీగా ఏర్పాట్లు, పటిష్టమైన బందోబస్తు
- విజయంపై ఎవరి ధీమా వారిదే

నల్లగొండ ప్రతినిధి, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేదెవరు.. ఓడేదెవరు? ఎక్కడెక్కడ ఎవరికి ఎంత మెజారిటీ వస్తుంది? కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది? ఆ ప్రభుత్వంలో రాష్ట్రం పాత్ర ఏ విధంగా ఉండబోతుంది? ఇలాంటి అనేక ప్రశ్నలపై నెలకొన్న ఉత్కంఠకు నేటితో తెరపడనుంది. మంగళవారం దేశమంతటా పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏకకాలంలో మొదలు కానుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ స్థానాల ఫలితం సైతం తేలనుంది. నల్లగొండలోని దుప్పలపల్లి సమీపంలో ఉన్న వేర్ హౌజింగ్ గోదాముల్లో నల్లగొండ లోక్‌సభ స్థానం ఓట్ల లెక్కింపు, భువనగిరిలోని అరోరా ఇంజినీరింగ్ కాలేజీలో భువనగిరి లోక్‌సభ స్థానం ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఉదయం 8 గంటల నుంచే కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుండగా.. సాయంత్రం 4 గంటల వరకు తుది ఫలితం వెల్లడయ్యే అవకాశం ఉంది. రెండు కౌంటింగ్ కేంద్రాల్లో ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేశారు. మూడంచెల పటిష్ట భద్రతతో పాటు వంద శాతం కెమెరాల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియ చేపట్టేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

గత నెల 13న జరిగిన పోలింగ్‌లో నల్లగొండ లోక్‌సభ స్థానంలో 12,77,137 ఓట్లు, భువనగిరి స్థానంలో 13,88,680 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ అనంతరం అన్ని చోట్ల నుంచి ఈవీఎంలను ఇటు నల్లగొండలోని దుప్పలపల్లి గోదాములకు, అటు భువనగిరి పరిధిలోని ఆరోరా ఇంజినీరింగ్ కాలేజీల్లోని స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచారు. ఇక్కడే ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం లెక్కింపు సజావుగా సాగేందుకు కావాల్సిన అన్ని చర్యలు చేపట్టినట్లు ఆర్ఓలు హరిచందన, హనుమంత్ కె.జెండగే ప్రకటించారు. ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో చోట 2వేల పైచిలుకు సిబ్బందిని వినియోగిస్తున్నారు. వీరందరికీ పలు దఫాలుగా శిక్షణ ఇచ్చి అన్ని విధాలుగా సిద్ధం చేశారు.

### 22 నుంచి 24 రౌండ్లు..

అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలను బట్టి మొత్తం 22 నుంచి 24 రౌండ్లలో తుది ఫలితం వెల్లడి కానుంది. అధికారులు తెలిపిన ప్రకారం చూస్తే.. దేవరకొండ అసెంబ్లీ ఓట్ల లెక్కలు 24 రౌండ్లు, నాగార్జునసాగర్ 22రౌండ్లు, మిర్యాలగూడ 19, హుజూర్‌నగర్ 22, కోదాడ 22, సూర్యాపేట 20, నల్లగొండ నియోజకవర్గానికి సంబంధించి 21 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుంది. అంటే తుది ఫలితం

నల్లగొండ కౌంటింగ్ కేంద్రంలో సిద్ధమైన హాల్

### తొలి ఫలితం 9గంటల వరకు..

మంగళవారం ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రక్రియ షురూ కానుంది. అంతకుముందే కౌంటింగ్ కేంద్రాలకు పోలింగ్ ఏజెంట్లు చేరుకుంటారు. అభ్యర్థులు లేదా వారి ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్స్ సీల్ తొలగిస్తారు. స్ట్రాంగ్ రూమ్స్ నుంచి ముందుగా పోస్టల్ బ్యాలెట్లను, తర్వాత ఈవీఎంలను కౌంటింగ్ హాల్స్‌కు తరలిస్తారు. ఒక్కో లోక్‌సభ స్థానం ఓట్ల లెక్కింపు కోసం ఎనిమిది హాళ్లను వినియోగిస్తున్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏడు హాళ్లు, మరో కటి పోస్టల్ బ్యాలెట్ల కోసం సిద్ధం చేశారు. పోస్టల్ బ్యాలెట్లు లెక్కించే హాల్‌లోనే రిటర్నింగ్ అధికారి టేబుల్ కూడా ఉంటుంది. ఒక్కో కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్లను ఏర్పాటు చేసి.. ఒక్కో రౌండ్‌లో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 14 పోలింగ్ కేంద్రాలకు చెందిన ఈవీఎంల్లోని ఓట్లను లెక్కిస్తారు. ఇలా మొత్తం ఒక్కో రౌండ్‌లో 98 ఈవీఎంల్లో నిక్షిప్తమైన ఓట్ల లెక్క తేలనుంది. ఇలా లెక్కించేటప్పుడు తొలి రౌండ్ ఫలితం ఉదయం 9గంటల కల్లా రావచ్చని అంచనా వేస్తున్నారు. తర్వాత సగటున ప్రతి 30 నిమిషాల్లో ఒక రౌండ్ లెక్కింపు పూర్తి కావచ్చని అంచనా. అయితే కంట్రోల్ యూనిట్‌లో బటన్ నొక్కితే ఎవరికి ఎన్ని ఓట్లు అనేది నిమిషాల్లో స్పష్టమైనా అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్లను నోట్ చేయడానికి ఎక్కువ సమయం తీసుకోనుంది. మొత్తం అభ్యర్థుల ఓట్లతో పాటు నోటాకు వచ్చిన ఓట్లను కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఏడు అసెంబ్లీల ఓట్ల ఒకచోట వేసి లెక్క తేల్చాక ఆర్ఓ సంతకంతో పాటు ఎన్నికల పరిశీలకుడి ఆమోదం కూడా లభిస్తేనే ఒక్కో రౌండ్ వారీగా ఫలితం అధికారికంగా బయటకు రానుంది.

రావాలంటే దేవరకొండకు చెందిన 24వ రౌండ్ కూడా పూర్తి కావాల్సిందే. ఇలా లెక్కించేటప్పుడు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఒక రౌండ్ ఫలితాన్ని ఒకచోట కలిపి రిటర్నింగ్ అధికారి లోక్‌సభ స్థానం ఫలితాన్ని ఒక్కో రౌండ్ వారీగా ప్రకటిస్తారు. అంతకంటే ముందు రిటర్నింగ్ అధికారి హాల్లో పోస్టల్ బ్యాలెట్లు, సర్వీస్ ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఎక్కడైనా ఈవీఎంలు మొరాయిస్తే.. వాటి ఫలితాన్ని సంబంధిత వీవీ ప్యాట్‌ను చివర్లో లెక్కించి తేలుస్తారు. ఉదయం 5:30 గంటలకే కౌంటింగ్ సిబ్బంది, పోలింగ్ ఏజెంట్లు వారికి జారీ చేసిన ఎన్నికల కమిషన్ పాసులతో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. పాస్‌లు ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తారు. ఇక పోలింగ్ సిబ్బంది, పోలీసులు, మీడియా ప్రతినిధులకు ప్రతి ఒక్కరికీ మంచినీరు, భోజన వసతి అక్కడే కల్పించారు.

### ఎవరి ధీమాలో వారే..

నల్లగొండ లోక్‌సభ స్థానంలో మొత్తం 22 మంది అభ్యర్థులు బరిలో ఉండగా బీఆర్ఎస్ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నుంచి కందూరు రఘువీర్‌రెడ్డి, బీజేపీ నుంచి శానంపూడి సైదిరెడ్డి మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. భువనగిరిలో 39 మంది అభ్యర్థులు పోటీలో నిలువగా బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్, కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ మధ్య ప్రధాన పోటీ ఉంది. రెండు చోట్లా ఎవరికి వారే విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

### చివర్లో వీవీ ప్యాట్ల స్లిప్పుల లెక్కింపు

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంల ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత.. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 5 వీవీ ప్యాట్లను ఎంపిక చేసి వాటిల్లోని స్లిప్పుల ఆధారంగా ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పోల్ అయ్యాయో తేలుస్తారు. వాటిని సంబంధిత ఈవీఎంలలో వచ్చిన ఫలితంతో పోల్చి సరి చూస్తారు. లాటరీ పద్ధతి ద్వారా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏయే వీవీ ప్యాట్లు పరిగణలోకి తీసుకోవాలనే అంశం తేలుస్తారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానున్న లెక్కింపు ప్రక్రియ సాయంత్రం 6 గంటల తర్వాతే ముగిసే అవకాశం ఉంది. అయితే.. అధికారికంగా ఫలితం మాత్రం 4 గంటల సమయంలో వెల్లడవుతుందనే అంచనా నెలకొంది. ఉదయం 11 గంటల వరకే ఫలితాలపై స్పష్టమైన అంచనా మాత్రం తేలనుంది. ఈవీఎంలను స్ట్రాంగ్ రూం నుంచి తీసుకురావడం మొదలు.. ఓట్ల లెక్కింపు చేపట్టే ప్రతి పరిణామాన్ని సీసీ కెమెరాలతోపాటు ప్రత్యేక వీడియో కెమెరాల పర్యవేక్షణలో చేపట్టనున్నారు.

ఓటింగ్ ముగిసిన నాటి నుంచి పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్ల లెక్కలతో కస్తీలు పట్టి ఉన్నారు. ఇక నేడు వెలువడనున్న అసలు ఫలితం ఎలా ఉంటుందోనన్న ఉత్కంఠత అందరిలో నెలకొంది. ఓటర్ల తీర్పు ఎలా ఉండబోతుందనేది మరికొద్ది గంటల్లోనే స్పష్టత రానుంది.

### కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రత

- 630 మంది పోలీసులతో బందోబస్తు
- నల్లగొండ జిల్లా ఎస్పీ చందనాదీప్తి

నీలగిరి, జూన్ 03 : పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ చందనాదీప్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఫలితాలు వెలువడిన తరువాత జిల్లా పరిధిలో ఏ చిన్నపాటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా దాదాపు 630 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, నలుగురు కంటే ఎక్కువగా గుంపులుగా తిరగడం చేయకూడదని సూచించారు. ఎన్నికల నియమావళి ప్రకారం అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని తెలిపారు. అభ్యర్థులు, ఏజెంట్లు, లెక్కింపునకు హాజరయ్యే అధికారులు సెల్‌ఫోన్లు, నిషేధిత వస్తువుల అయిన అగ్గిపెట్టె, లైటర్, ఇంక్ బాటిల్, లిక్విడ్, వాటర్ బాటిల్, పేలుడు వస్తువులను లెక్కింపు కేంద్రాల్లోకి తీసుకు రాకూడదని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద విధులకు హాజరయ్యే ప్రధాన ఏజెంట్లు, కౌంటింగ్ ఏజంట్లు, మీడియా ప్రతినిధులు ఎన్నికల అధికారి జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డు తప్పక వెంట ఉంచుకొని తనిఖీలు చేసే పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు. వాహనాలను పార్కింగ్ స్థలంలోనే పార్క్ చేయాలని, ప్రతిఒక్కరూ ఎన్నికల బంధనలు పాటించాలని సూచించారు.

బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్

# అభివృద్ధిని మరిచిన కాంగ్రెస్ సర్కారు

- నిరుత్సాహ పడొద్దు.. ప్రజలకు కాపలాదారులుగా ఉందాం
- బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్
- ఆ పార్టీ కార్యాలయంలో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలు

సూర్యాపేట టౌన్, జూన్ 3 : ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు, అభివృద్ధిని పూర్తిగా మరిచిందని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్రం సాధించి పదేండ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్నారని, ఆరు నెలల కాంగ్రెస్ పాలనలో ఆయా వర్గాల ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని, పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అత్యధిక సభ్యత్వాలతో, బలమైన గ్రామ శాఖలతో నిర్మాణం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన బీఆర్ఎస్ పడిపోతుందని కాంగ్రెస్ నాయకులు పిచ్చి కలలు కంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ జేజేమ్మలు వచ్చినా తెలంగాణలో కేసీఆర్‌కు తిరుగు లేదని అన్నారు. సెగ్రిగేషన్ షెడ్లు, ట్రాక్టర్లు, పల్లె, పట్టణ ప్రకృతి వనాలు, హరితహారంతోపాటు పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా పల్లెలను, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. పదేండ్లపాటు పరిశుభ్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రం ఆరు నెలల్లో అధోగతి పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో తాము వేరే పార్టీల్లో ఉన్నప్పటికీ తెలంగాణ పాటలు వింటున్నప్పుడల్లా ఏదో తప్పు చేస్తున్నామని భవిష్యత్ తరాలు మనలను క్షమించవని భావించి బీఆర్ఎస్ పార్టీలో చేరి ఉద్యమంలో భాగస్వాములమయ్యామని చెప్పారు. ప్రభుత్వం మారినంత మాత్రాన నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై ఈగ వాలినా సహించబోమని హెచ్చరించారు. తెలంగాణకు రక్షణ కవచం బీఆర్ఎస్ అని, రాష్ట్రానికి కేసీఆరే శ్రీరామరక్ష అని అన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో కాంగ్రెస్ మోసం చేసిందని ప్రజలు గ్రహించారని తెలిపారు. కాంగ్రెస్‌లో కుమ్ములాటలు మొదలయ్యాయని, ఒకరంటే మరొకరికి పడడం లేదని, ఆ ప్రభుత్వం ఎక్కువ కాలం మనజాలదని అన్నారు. సంవత్సరంలోపు నలుగురు ముఖ్యమంత్రులు తయారవుతున్నారని, మరో 8మంది తమను మంత్రివర్గంలోకి ఎప్పుడు తీసుకుంటారా? అని ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి గెలుస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో మరింత వ్యతిరేకత వస్తుందని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు కాపలాదారులుగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకుడు ఎస్ఏ రజాక్, జడ్పీటీసీలు జీడి భిక్షం, దావుల వీరప్రసాద్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

### స్థానిక సంస్థల్లో విజయం మనదే

ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మడం లేదు. చావు అంచులకు వెళ్లి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ పదేండ్ల కంటికి రెప్పలా కాపాడుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారు. గ్రామాల్లో ఆరు నెలలుగా అభివృద్ధి ఆగిపోయింది. సమస్యలు చెప్పుకొనేందుకు బీఆర్ఎస్ నాయకులు ఎక్కడున్నారని ప్రజలు దేవులాడుకుంటున్నారు. ప్రభుత్వంపై మరింత వ్యతిరేకత వచ్చి స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ విజయకేతనం ఎగురవేయడం ఖాయం.

– జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు

### కేసీఆరే శరణ్యమంటున్న ప్రజలు

తెలంగాణ రాష్ట్రాన్ని దేశమే ఆశ్చర్యపోయేలా అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే. ఆరు నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉండడంతో ప్రజలు మళ్లీ కేసీఆరే శరణ్యమంటున్నారు. పదేండ్లలో తెలంగాణలో అన్ని రంగాల ప్రజలు అభివృద్ధి చెందారు. మార్పు అంటూ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ప్రజలను, అభివృద్ధిని మరిచారు. మళ్లీ మనమే అధికారంలోకి వస్తాం.. నాయకులు, కార్యకర్తలు సమన్వయం పాటిస్తూ పార్టీ ఇచ్చే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

– కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

నల్లగొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జాతీయ, పార్టీ జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డి, చిరుమర్తి, భాస్కర్‌రావు, జడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ నేతలు కృష్ణారెడ్డి, రాంచందర్ నాయక్, విజయసింహారెడ్డి, రేగట్టె, పల్లె రవికుమార్ తదితరులు

## బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో
# రాష్ట్రం ఎంతో అభివృద్ధి

## ప్రజల సంక్షేమానికి కేసీఆర్ ఎంతో పరితపించారు

- ప్రజల సంక్షేమానికి కేసీఆర్ ఎంతో పరితపించారు
- బీఆర్ఎస్ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ వేడుకల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, జడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి
- రాష్ట్ర సాధన, పదేండ్ల అభివృద్ధిపై ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శన

నల్లగొండ, జూన్ 3 : బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం నల్లగొండలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్ కుమార్‌తో కలిసి రవీంద్రకుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేసి జయ జయహే తెలంగాణ గీతాలాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ఆవిర్భావానికి ముందు పరిస్థితులను, కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదేండ్లలో చేపట్టిన అభివృద్ధిని ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను నాయకులు, కార్యకర్తలు ఆసక్తితో తిలకించి నాటి సంఘటనలను గుర్తు చేసుకొని భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, జడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ నేత కేసీఆర్ రాష్ట్రం సాధించిన తర్వాత ముఖ్యమంత్రిగా పదేండ్లలో ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. కేసీఆర్ నిత్యం రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పరితపించారని తెలిపారు. ఈ పదేండ్లలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెంది దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఇంకా పాలనపై దృష్టి పెట్టలేదని విమర్శించారు.

కాంగ్రెస్ సర్కార్ పద్ధతి మార్చుకొని ప్రజాపాలన సవ్యంగా చేయాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు తిప్పన విజయసింహారెడ్డి, రామచందర్‌నాయక్, పల్లె రవికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలీ, రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, నాయకులు పిచ్చయ్య, రామ్మోహన్, జమాల్ ఖాద్రీ, సహదేవరెడ్డి, శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, దేప వెంకట్‌రెడ్డి, యాదయ్య, గోవర్ధన్, జాఫర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

# మంచినీళ్ల ట్యాంకులో మృతదేహం

- నల్లగొండ పాతబస్తీ ట్యాంకులో వ్యక్తి మృతదేహం గుర్తింపు
- దుర్వాసన రావడంతో నీటి సరఫరా నిలిపివేసిన అధికారులు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ చందనాదీప్తి
- విచారణ అధికారిగా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర నియామకం

నీలగిరి, జూన్ 3 : నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పాతబస్తీ హిందూపూర్ వాటర్ ట్యాంకులో వ్యక్తి మృతదేహం కనిపించడం కలకలం రేపింది. అదివారం సాయంత్రం, సోమవారం ఉదయం ఆ ట్యాం కు పరిధిలోని నాలు గు వార్డుల ప్రజలకు సరఫరా అయిన నీటిలో దుర్వాసన రావడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో మున్సిపల్ సిబ్బంది ట్యాంకులో పరిశీలించగా.. దుర్వాసన వస్తుండడంతో నీటిని ఖాళీ చేశారు. అడుగు భాగంలో మృతదేహం కనిపించగా.. బయటకు తీశారు. 12 రోజుల క్రితం తప్పిపోయిన అదే ప్రాంతానికి చెందిన అవుల వంశీకృష్ణ (27)గా స్థానికులు గుర్తించారు. వంశీకృష్ణ యాదవ్‌కు అనారోగ్య సమస్యతోపాటు మానసిక స్థితి సరిగా లేదని, గత నెల 24న రాత్రి నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వంశీ అదే రోజు రాత్రి హిందూపూర్ వాటర్ ట్యాంకులో దూకి మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మున్సిపల్ అధికారులు గుర్తించకపోగా ఆ ట్యాంకు నుంచి నాలుగు వార్డుల పరిధిలోని సుమారు రెండు వేల కుటుంబాలకు నీటిని సరఫరా చేశారు. కాగా, కొద్ది రోజుల నుంచి తాగునీరు తేడాగా ఉండడంతో 11వ వార్డు ప్రజలు వాటర్ సప్లయ్ సిబ్బందిని ప్రశ్నించారు. దాంతో మున్సిపాలిటీ సిబ్బంది, స్థానికులు వాటర్ ట్యాంకులో చెక్ చేయగా. వంశీకృష్ణ మృతదేహం లభ్యమైంది. మంచి నీటి ట్యాంకులను చెక్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మున్సిపల్ అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు. అయితే.. మున్సిపాలిటీ అధికారులు మాత్రం మూడ్రోజులకోసారి మంచినీటి ట్యాంకులను శుభ్రం చేస్తున్నామని, అందులో భాగంగా మే 30న వాటర్ ట్యాంకును క్లీన్ చేశామని చెప్తున్నారు. రోజూ నీటిని విడుదల చేసే సమయంలో నీటి లెవల్స్ చూసి వదులుతామని చెప్పుకొచ్చారు. కానీ.. 10లక్షల కెపాసిటీ ఉన్న ట్యాంకు చాలా పెద్దగా ఉండడం, పైకప్పు చిన్నదిగా ఉండడంతో మృతదేహం కనబడటానికి వీలుండదని స్థానికులు పేర్కొంటున్నారు. వైద్య నిపుణులు మాత్రం మృతదేహం రెండు, మూడు రోజుల తరువాత పైకి లేచి కొంత సమయానికి మళ్లీ అడుగుకు పోతుందని, నీటిని పూర్తిగా తీయకుండా బ్లీచింగ్ చల్లడం వల్లే మృతదేహం వారికి కనబడక పోయి ఉండవచ్చని చెబుతున్నారు. కానీ.. గత నెల 24న ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వంశీ రెండు, మూడు రోజుల క్రితం చనిపోతే ఇన్ని రోజులు ఎక్కడ ఉన్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు మాత్రం అదే రోజు ఆత్మహత్య చేసుకుని ఉంటాడని చెబుతున్నారు. నందికొండ మున్సిపాలిటీ వాటర్ ట్యాంకులో కోతులు పడి మృతి చెందిన ఘటన మరువక ముందే నల్లగొండలోని మంచినీటి ట్యాంకులో వ్యక్తి డెడ్‌బాడీని పది రోజులుగా పరిశీలించకపోవడం దారుణమని పలువురు పేర్కొంటున్నారు. కాగా, వాటర్ ట్యాంకులో వ్యక్తి మృతదేహం ఘటనపై జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన స్పందించారు. పూర్తి వివరాలు తెలుసుకునేందుకు వెంటనే విచారణ అధికారిగా అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్రను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆమె ఆదేశించారు.

మృతదేహం లభించిన వాటర్ ట్యాంకు ఇదే

### సూర్యరశ్మి తగలకపోవడంతో మృతదేహం కుళ్లిపోలేదు

వంశీకృష్ణ 12 రోజుల క్రితం ట్యాంకులో పడి ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని వైద్య నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకు సామర్థ్యం 10లక్షల కెపాసిటీ కాగా.. నీరు వస్తుండడం, పోతుండడంతో పెద్దగా ప్రమాదం జరుగలేదు. ట్యాంకు లోపల చీకటిగా ఉండడం, మృతదేహానికి సూర్యరశ్మి తగలకపోవడంతో పాడై పోవడానికి చాలా రోజుల సమయం పడుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. మృతదేహం కుళ్లిపోనందున మలినాలు బయటకు రాకపోయి ఉండవచ్చని చెబుతున్నారు.

### 50 ఇండ్లల్లో వైద్య పరీక్షలు

నీటిలో దుర్వాసన వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించిన జిల్లా యంత్రాంగం వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో వైద్యారోగ్య శాఖ అధికారులు నాలుగు వార్డుల పరిధిలోని సుమారు 50 ఇండ్లల